

# మాతృదేవోభవ



**కోటమర్తి రాధాహిమబిందు**

**జి.వి.ఆర్. కల్చరల్ ఫౌండేషన్ కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ**

టాక్సీలో వస్తున్న ప్రభావతీదేవి మనసు తరంగంగా ఎగిసిపడుతూంది. ఆనందంతో గొంతు మూగబోయినట్లయింది. మాటలు రాక, మనసు కుదురుగా ఉండక, కన్నీళ్లు నిండుతుంటే ముఖం తిప్పుకుని కిటికీ నుండి బయటకు చూడసాగింది.

''అమ్మా!'' పిలిచాడు సూర్యదేవ్.

తల తిప్పి చూసింది ప్రభావతీదేవి. కన్నీళ్లు రాలిపడి బుగ్గల మీదుగా జారాయి.

''అమ్మా... ప్లీజ్... బాధ పడొద్దు'' అంటూ ప్రభావతీదేవి చుట్టూ చేయి వేసి దగ్గరికి జరిగాడు సూర్యదేవ్.

అతని భుజం మీద వాలిపోయి నిశ్చింతగా కళ్లు మూసుకుంది ప్రభావతీదేవి. సూర్యదేవ్ కళ్ల నిండా ఆనందబాష్పాలు నిండగా, మనసు ఎంతో ప్రశాంతంగా అయింది. టాక్సీ పరిగెత్తుతూంది వారిద్దరి మనసుల్లాగానే.

టాక్సీ ఓ యింటి ముందాగింది.

''అమ్మా, యిదే మన యిల్లు. దిగు.''

దిగింది ప్రభావతీదేవి.

టాక్సీకి డబ్బు యిచ్చి బ్యాగు తీసుకుని ప్రభావతీదేవి భుజాల చుట్టూ చేయి వేసి లోపలికి తీసుకొచ్చాడు సూర్యదేవ్.

డోర్ లాక్ తీసి చిరునవ్వులు చిందిస్తూ అన్నాడు, ''అమ్మా, ఒక్క నిముషం,

యిప్పుడే వస్తాను. ప్లీజ్. యిక్కడే ఉండు'' అంటూ లోపలికి వెళ్లి హారతితో తిరిగివచ్చాడు.

ప్రభావతీదేవి విస్తుపోయింది. హారతి ప్రభావతీదేవి చుట్టూ మూడు సార్లు తిప్పి ''అమ్మా... లోపలికి రా'' అన్నాడు.

ప్రభావతీదేవి కుడి కాలు లోపలికి పెట్టింది.

''అమ్మా, యిదే మనిద్దరి సామ్రాజ్యం. నువ్వు ఈ యింటి మహారాణివి. నేను నీ సేవకుణ్ని. యిలా ఆర్డర్ పాస్ చేస్తే చాలు 'జీ హుజూర్' అంటూ చేతులు కట్టుకుని నిలబడతాడీ సేవకుడు.''

ప్రభావతీదేవి కళ్లు కన్నీటి కాల్వలే అయ్యాయి.

''అమ్మా, వద్దు. తప్పు. అసలు యింకెప్పుడూ నువ్విలా కన్పించవద్దు. రా అమ్మా, యిల్లు చూపిస్తాను'' అంటూ యిల్లంతా చూపించాడు.

''చాలా బాగుంది'' మెచ్చుకోలుగా అంది ప్రభావతీదేవి.

''అమ్మా నాకు రెండే రెండు కోరికలు. ఒకటి అమ్మ, రెండు సొంత యిల్లు. ఇప్పుడు రెండూ నెరవేరాయి. ఇంకో అరగంటే టైముంది. త్వరగా పాలు పొంగించాలి'' అంటూ బీరువా నుండి ఒక కవరు తెచ్చి చేతిలో ఉంచి పాదాభివందనం చేశాడు.

''ఏంటి?'' చూసి తెల్లబోయింది ప్రభావతీదేవి.

పట్టుచీరె.

''ఈ చీరె కట్టుకుని పాలు పొంగించాలి.''

''అలాగే'' అంటూ బాత్ రూంలోకివెళ్లి కరవుతీరా ఏడ్చింది.. ఆ తర్వాత పట్టుచీరె కట్టుకుని దేవత ప్రత్యక్షమైనట్లుగా సూర్యదేవ్ కళ్ల ముందు నిలబడింది.

''అమ్మా!'' అంటూ కళ్ల నిండుగా చూసుకున్నాడు ప్రభావతీదేవిని. తను స్నానం చేసి వచ్చి రెడీ అయ్యాడు. పట్టు పంచె, లుంగీలా కట్టుకుని పైన పట్టు కండువా కప్పుకుని ప్రభావతీదేవి ఎదురుగా నిలబడ్డాడు. చిరునవ్వుతో తలనిమిరింది ప్రేమగా.

సూర్యదేవ్ పక్కనే నిలబడగా పాలు పొంగించింది. ప్రభావతీదేవి. యిద్దరూ కలిసి పాయసం చేసుకున్నారు. దేవుడి పూజ ముగించుకున్నారు. రెండు వెండి గిన్నెలు ప్రభావతీదేవికి యిచ్చాడు. రెండింటిలో పాయసం వేసింది.

ఇద్దరూ హాల్లోకి వచ్చారు. పరిచిన తివాచీ మీద యిద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు. ఒకళ్లనొకళ్లు ఆపేక్షగా చూసుకుంటూ తియ్యటి పాయసాన్ని ఎంతో యిష్టంగా తిన్నారు.

** ** **

వారం రోజులు గడిచాయి. సూర్యదేవ్, ప్రభావతీదేవి సాంగత్యంలో చిన్న పిల్లాడైపోయాడు. ''అమ్మ.. అమ్మ'' అంటూ అమ్మ చుట్టూ తిరుగుతూ, ప్రతీదీ అమ్మనే అడుగుతూ, అమ్మను సంతోష

పెడుతూ, అమ్మను క్షణమైనా వదలకుండా అంటిపెట్టుకునే వున్నాడు.

"అమ్మా. వారం రోజుల లీవ్ అయిపోయింది. ఈ రోజు నుండి ఆఫీసుకు వెళ్లాలి. నువ్వు పర్మిషన్ యిస్తే వెళ్తాను."

ప్రభావతీదేవి, సూర్యదేవ్ ముఖాన్ని చేతుల మధ్యకు తీసుకుంది. అరచేతులూ, వేళ్లూ ముడిచి చెంపలు నిమిరి ఆ వేళ్లని పెదవుల మీద వుంచుకుని ముద్దు పెట్టుకుంది.

"వెళ్లు నాయనా. నాకు అంతా అలవాటైందిగా. క్షేమంగా వెళ్లి లాభంగా రా" అంటూ దీవించింది.

ఆఫీసుకు రెడీ అయ్యాడు సూర్యదేవ్. తల్లి పెట్టిన టిఫిన్ తిని కాఫీ తాగి బ్రేవ్‌మంటూ తేన్చాడు.

"అమ్మా యిలా రా."

వచ్చింది ప్రభావతీదేవి. తల్లి రెండు చేతులూ పట్టుకుని ఆ చేతుల్లో ముఖం దాచుకున్నాడు.

"అమ్మా, ఈ చేతుల్లో ఏముంటుందమ్మా? కడుపు నిండా అన్నం పెడతాయి. కరవు తీరా నిద్ర పుచ్చుతాయి. కరుణతో ఆశీర్వదిస్తాయి. అందుకేనేమో అమ్మా, తల్లిని మించిన దైవం లేదు అంటారు. యింకేదో దైవం నాకెందుకమ్మా? యిక నువ్వేనాకన్నీ" అంటూ ప్రభావతీదేవి నడుము చుట్టూ చేతులు వేసి, ఆమె ముఖాన్ని అపురూపంగా చూడసాగాడు.

"సాయంత్రం వస్తావుగా. అప్పుడు అమ్మపై ఎంతో ప్రేమ జల్లు కురిపించవచ్చు. ఆ జల్లులో తడవటం నాకూ చాలా బాగుందిరా!" నవ్వింది ప్రభావతీదేవి.

ఆఫీసుకు వెళ్లే ముందు తల్లిపాదాలకు నమస్కరించాడు.

"సూర్యా..!"

"అమ్మా, ఇలా నాకెంతో యిష్టం. ఇప్పటికి తీరింది.. రోజూ ఇలాగే చేస్తాను. ఎప్పటికీ యిలాగే చేస్తాను. ఓ.కే. అమ్మా. బై" అంటూ చేయి ఊపి వెళ్లిపోయాడు సూర్యదేవ్.

గేటు వేసి లోపలికి వచ్చింది ప్రభావతీదేవి. హాలు మధ్యలో అలాగే నిలబడిపోయింది. అప్పుడు గుర్తొచ్చారు బలరాం. చక్రధారి.

** ** **

అందరిలా వాళ్లూ తల్లి ఒడిలోనే పెరిగారు. తల్లి నడిపిస్తేనే బుడిబుడి అడుగులు నేర్చుకున్నారు. వేగంగా పరిగెత్తకు కిందపడిపోతావు అని ఎన్నో జాగ్రత్తలు చెప్పినా వేగంగానే పరిగెత్తారు. కింద పడలేదు గాబట్టి యింకా యింకా పరిగెత్తుతూనే వున్నారు. అలసిపోవటం అంటూ లేనేలేదు. ఎందుకుంటుంది అలసట? సంపాదించిన కొద్దీ వస్తూనే ఉంది. బిల్డింగ్‌లు ఎప్పుడో కట్టేశారు. బ్యాంక్ బ్యాలెన్సులు మూలుగుతున్నాయి. ఇంకా ఏవేవో కొత్త బిజినెస్‌లు మొదలవుతూనే ఉన్నాయి. అందులో బిజీ అయిపోతూనే



వున్నారు. ఇంకేదో చేయాలని ఆరాటం. ఇది చాలదు అన్న తపన. యివే బంధంగా అనుకున్నప్పుడు, అవీ బంధించి పూర్తిగా తమ సొత్తు చేసుకున్నప్పుడు, ఇంకో బంధం గురించి ఆలోచన ఎందుకుంటుంది? ప్రాణం వున్న మనుషులకంటే ప్రాణం లేని వాటిపై మమకారం కల్గినప్పుడు బంధనాలు సడలక మానవు కదా!

"చక్రీ.. అంత యింట్లో అమ్మ ఒక్కతీ ఏముంటుంది? బోర్‌గా ఫీలవుతుంది. నువ్వు తీసుకొచ్చుకో గూడదూ? ఇద్దరం బయటకు వెళ్తాం. ఎప్పుడు ఎక్కడికి వెళ్తామో తెలియదు. అమ్మ కోసం యిద్దరు పనివాళ్లు ఉండాల్సి వస్తుంది. వంటావిడ అనవసరం. పని మనిషి అనవసరం. తన వంట తనే చేసుకుంటుంది. ఎప్పుడో ఎవరో వస్తారని యిద్దర్ని వుంచుకోవటం ఎందుకు? పార్టీలూ, డిన్నర్‌లు సాధారణంగా బయటే గదా!" అన్నాడు బలరాం.

"సారీ అన్నయ్యా. నాకు వీలు గాదు. నీ అంత కాకపోయినా మాకూ ఏవేవో బిజినెస్‌లు వున్నాయి. మేమూ బిజీగానే ఉంటున్నాం."

"అవుననుకో, మీరు అటూ యిటూ వెళ్లినా పిల్లలు వుంటారుగా. అమ్మకు కాస్తా టైమ్ పాస్ అవుతుంది" అన్నాడు బలరాం..

"పిల్లల్ని ఊటీలో చదివించాలనుకుంటున్నాం. వాళ్లు అక్కడే హాస్టల్‌లో వుంటారు గదా. పిల్లలు యిక్కడ ఉండబోవటం లేదు. అమ్మకు టైమ్ పాస్ అంటే మరి నేనేం చేయను?"

"మరేం చేద్దాం? సమస్య నా ఒక్కడిదే గాదు గదా. సుమిత్ర అడిగిరమ్మంది."

"నువ్వే ఆలోచించు" ముఖం గంటు పెట్టుకుని అన్నాడు చక్రధారి.

భర్త ఎలాంటి ఒప్పందాలు చేసుకుంటాడో అని భయపడిపోయి వాళ్లలో జాయిన్ అయింది చంద్రిక. అదో అంతర్జాతీయసమస్య అయినట్లుగా గంటలకు గంటలు చర్చించుకుని చివరికి ఒక్క మాటలో తేల్చేశారు.

"అమ్మని వృద్ధాశ్రమంలో వుంచుదాం" అని. ఇంత మంచి ఐడియా భలేగా వచ్చిందని తమను తామే అభినందించుకున్నారు. పైగా మంచి పనికి ఆలస్యం ఎందుకన్నట్లుగా చంద్రిక త్వరపెట్టింది. బ్రదర్స్ యిద్దరూ కలిసి వృద్ధాశ్రమాలు చూడటానికి వెళ్లారు. ఒక వృద్ధాశ్రమం బాగా నచ్చింది. వాళ్ల స్థాయికి తగ్గట్లుగా అనిపించగా, దాన్ని ఎన్నుకుని ఏదో టెన్షన్నుండి బయట పడినట్లుగా నిశ్చింతగా ఊపిరి పీల్చుకున్నారు.

విషయం తల్లి దాకా పాకిపోయింది. నలభై లక్షలు ఖరీదు చేసే ఆ ఇంట్లో.. ఎటు చూసినా వేలు పోసిన కొన్న డెకరేటివ్ వస్తువులతో నిండివున్న ఆ హాల్లో... ఖరీదైన తివాచీ మీద వున్న రెండు లక్షల యిరవై వేల ఖరీదు చేసే సోఫాల్లో కూర్చుని విలాసంగా చూస్తూ, నల్గురి మధ్య తల్లినో ముద్దాయిగా చేసి వాదించారు. ఎవరి వాదంలో వారు ఆరితేరి న్యాయం ఉందనిపించేలా మాట్లాడారు. తల్లి పెదవి విప్పనూ లేదు. తన అభిప్రాయం చెప్పనూ లేదు.

(మిగతా వచ్చేవారం)